సాక్షి కామారెడ్డి

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



ఓట్ల కోసమే..

ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు తుపాకీ రాముడిలా మాట్లాడుతున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు.

- 8లో ▸



ముదిరాజ్‌లను విస్మరిస్తే..

ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి స్వామి డిమాండ్ చేశారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.0 /22.0

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

50 మంది హెచ్‌ఎంల బదిలీ

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. 50 మంది ప్రధానోపాధ్యాయులు బదిలీలు అయ్యారు. 39 మందికి కామారెడ్డి జిల్లా పరిధిలోనే పోస్టింగ్ దక్కగా.. తొమ్మిది మందిని ఇతర జిల్లాలకు పంపించారు. వేరే జిల్లాల ఇద్దరు ప్రధానోపాధ్యాయులు జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం జిల్లాలో 54 మంది హెచ్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఇంకా 124 హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతి కల్పించి ఆయా స్థానాలకు బదిలీ చేయనున్నారు. పదోన్నతల కోసం సీనియారిటీ జాబితాను రూపొందించారు. పదోన్నతల తర్వాత ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల జాబితాను వెల్లడించనున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయడానికి ఆసక్తిగలవారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌డబ్ల్యూ పాఠ్యాంశాలు బోధించడానికి అర్హులైన పీజీ అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బోధన అనుభవంతో పాటు సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 25న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

23న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఈనెల 23న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. అండర్ -14, 16, 18, 20 బాలబాలికలకు రన్, త్రో, జంప్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మార్కుల జాబితాతో పాటు డ్రెస్ కోడ్‌లో స్టేడియానికి రావాలని సూచించారు.

జిల్లా ఆస్పత్రి సందర్శన



కామారెడ్డి టౌన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) కమిషనర్ అజయ్‌కుమార్ మంగళవారం ఉదయం జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లు, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మిలతో మాట్లాడి ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో శ్రీనివాస్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'క్యాంటీన్ కోసం దరఖాస్తు చేసుకోండి'

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రభుత్వ కళాశాలలో క్యాంటీన్, జిరాక్స్ సెంటర్ నిర్వహించడానికి ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 వరకు పనిచేయాల్సి ఉంటుందని, ఈనెల 22 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సెల్ఫీ విత్ గణేశ్..






పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నం..
96039 39111

'నారీ శక్తి'కి వందనం



చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తమవుతోంది. కేంద్రం నిర్ణయాన్ని మహిళలు స్వాగతిస్తున్నారు. దశాబ్దాల కల సాకారమవుతోందని పేర్కొంటున్నారు. అయితే పేరుకు మహిళలకు సీట్లిచ్చి పెత్తనం కుటుంబ సభ్యులు చేసే పరిస్థితి ఉండకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా నేతలు
- పొలిటికల్ సర్కిళ్లల్లో ఇదే అంశంపై చర్చ

సాక్షి, కామారెడ్డి: జనాభాలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. పాలనలోనూ చాలామంది తమదైన ముద్ర వేస్తున్నారు. సర్పంచ్ నుంచి మొదలుపెడితే దేశ ప్రధాని, రాష్ట్రపతి దాకా ఎంతో మంది తమ సత్తా చాటారు. అయితే చైతన్యం ఉన్నా అవకాశం దొరక్క చాలా మంది మహిళలు ముందుకు వెళ్లలేకపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో యాభై శాతం రిజర్వేషన్లు అమలవుతుండడంతో ఎంతోమంది మహిళలు స్థానిక సంస్థల ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. చట్టసభల్లోనూ రిజర్వేషన్ల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మహిళలకు ఇటీవలి పరిణామాలు ఉత్సాహాన్ని, సంతోషాన్నిస్తున్నాయి. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టింది. చట్టంగా మారితే ఈసారి కాకుంటే తర్వాతి ఎన్నికల్లోనైనా రిజర్వేషన్లు అమలవుతాయన్న భరోసా ఏర్పడింది.

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. నాలుగు చోట్ల పురుషులకన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అప్పుడెప్పుడో ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించగా, జుక్కల్‌లో పాలించే అవకాశం ఒక్కసారి మాత్రమే దొరికింది. కామారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో మహిళలకు పోటీ చేసే అవకాశాన్ని ఇప్పటివరకు ఏ పార్టీ ఇవ్వలేదు. రిజర్వేషన్లు కల్పిస్తేనే అవకాశాలు వస్తాయని బలంగా నమ్ముతున్న మహిళలు.. దశాబ్దాలుగా అనేక పోరాటాలు నిర్వహించారు. రిజర్వేషన్ల అంశం తెరపైకి వచ్చిన పుడల్లా ఆందోళనలు నిర్వహించడం, కొంత కాలానికి పక్కకు వెళ్లడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయ సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టడంతో మహిళల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

స్థానిక సంస్థల్లో యాభై శాతం మహిళలే..

స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. దీంతో 22 మండలాలకుగాను 11 మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు మహిళలు కొనసాగుతున్నారు. కొన్నిచోట్ల 'ఆయన' పెత్తనమే నడుస్తున్నా.. ఇంకొన్నిచోట్ల మహిళా ప్రజాప్రతినిధులు పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి మహిళకు రిజర్వ్ కావడంతో తొలి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా దఫేదార్ శోభ ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో మహిళలు తమ వాణిని వినిపిస్తున్నారు. లింగంపేట జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి తదితరులు ప్రతిసారి సమావేశాల్లో సమస్యలను లేవనెత్తుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. మరికొందరు జెడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా ఆయా సమావేశాల్లో తమదైన వాణి వినిపిస్తూ సత్తా చాటుతున్నారు.

నియోజక వర్గాలవారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఎలక్ట్రోల్	మొత్తం
జుక్కల్	94,988	97,061	10	138	1,92,197
బాన్సువాడ	89,793	97,668	08	191	1,87,660
ఎల్లారెడ్డి	1,03,166	1,10,846	03	258	2,14,273
కామారెడ్డి	1,13,415	1,21,164	30	160	2,34,769

స్త్రీ ఓటర్లే ఎక్కువ..

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో పురుషులకన్నా మహిళా ఓటర్లు ఏడు వేల పైచిలుకు ఎక్కువగా ఉన్నారు. ఎల్లారెడ్డి, బాన్సువాడలలోనూ మహిళా ఓటర్లు ఏడు వేలపైనే ఎక్కువున్నారు. జుక్కల్‌లో మూడు వేల మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. చట్టసభల్లో మహిళా బిల్లు ఆమోదం పొంది, అమల్లోకి వస్తే జిల్లాలో కనీసం ఒక్క నియోజకవర్గమైనా మహిళలకు రిజర్వ్ అవుతుందని భావిస్తున్నారు.

చర్చనీయాంశం..

మహిళా రిజర్వేషన్‌లపై సర్వత్రా చర్చ సాగుతోంది. రాజకీయ వర్గాల్లో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఫలానా నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ అవుతుందంటే.. కాదు ఫలానా నియోజకవర్గం అవుతుందని వాదించుకుంటున్నారు. ఒకవేళ మహిళలకు రిజర్వ్ అయితే ఎక్కడ ఎవరు బరిలో నిలుస్తారన్న దానిపైనా చర్చ జరుగుతోంది. ప్రధానంగా సిట్టింగ్ ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు పోటీకి ఆసక్తి చూపవచ్చన్న భావన వ్యక్తమవుతోంది.

ఆనందంగా ఉంది



స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లున్నాయి. చట్టసభల్లోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లు ప్రవేశపెట్టినందుకు ఆనందంగా ఉంది. ఈ బిల్లు ఆమోదం పొందితే పార్లమెంట్, అసెంబ్లీలలోనూ మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది.

– కర్రె మాధవి, ఎంపీపీ, ఎల్లారెడ్డి

ప్రధానికి కృతజ్ఞతలు



మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ముప్పై ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నా. ఎట్టకేలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినందుకు సంతోషంగా ఉంది. ప్రధానమంత్రికి కృతజ్ఞతలు.

– అరుణతార, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

ఎమ్మెల్సీ కవిత పోరాటం వల్లే..



మహిళా రిజర్వేషన్ కోసం ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో పోరాటం చేశారు. ఆమె పోరాటం వల్లే కేంద్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ కల్పిస్తే మహిళలు రాజకీయాల్లో మరింత రాణిస్తారు.

– దఫేదార్ శోభ, జెడ్పీ చైర్‌పర్సన్

సంతోషించదగ్గ పరిణామం..



చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశం దశాబ్దాలుగా నానుతూ వస్తోంది. ఇప్పుడు చట్టం కాబోతుండడం సంతోషించదగ్గ పరిణామం. చట్టసభల్లోకి మహిళలు వెళ్లడం కోసం 33 శాతం రిజర్వేషన్లు తీసుకురావడం ఎంతో అభినందనీయం.

– ఏలేటి శ్రీలత, జెడ్పీటీసీ సభ్యురాలు, లింగంపేట

మంచి అవకాశం



పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడం శుభ పరిణామం. దశాబ్దాల పోరాటం ఫలించబోతోంది. మహిళలు ప్రస్తుతం అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ఈ బిల్లుతో రాజకీయాల్లోనూ మంచి అవకాశాలు లభిస్తాయి. బిల్లును స్వాగతిస్తున్నాం.

– సుమిత్రానంద్, టీఎస్‌పీఎస్‌సీ సభ్యురాలు

రాజకీయాల్లోనూ సత్తా చాటుతాం



మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఈ బిల్లు ఆమోదం పొందితే మహిళలు రాజకీయాల్లో తమ సత్తాచూపే అవకాశం లభిస్తోంది. ఈ బిల్లుతో మంచి పాలనకు నాందిపడుతుంది.

– ఆకుల సుజిత, మున్సిపల్ కౌన్సిలర్, కామారెడ్డి

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..



ఎన్నో ఏళ్లుగా మహిళా బిల్లుకోసం ఎదురుచూస్తున్నాం. సమాజం కోసం పోరాడే, మంచి పాలన అందించే సత్తా ఉన్న మహిళలకు రిజర్వేషన్లతో మేలు జరుగుతుంది. అన్ని పార్టీలు అన్ని ఎన్నికల్లోనూ మహిళలకు సముచిత సంఖ్యలో సీట్లివ్వాలి.

– జమునా రాథోడ్, వైఎస్సార్‌టీపీ నాయకురాలు, కామారెడ్డి

బిల్లును స్వాగతిస్తున్నాం..



ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో పెట్టినందుకు సంతోషంగా ఉంది. ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగానే కేంద్రం బిల్లును ప్రవేశపెట్టింది. ఇది ముమ్మాటికి కవితక్క విజయమే. బిల్లును స్వాగతిస్తున్నాం.

– నిట్టు జాహ్నవి, మున్సిపల్ చైర్‌పర్సన్, కామారెడ్డి

ప్రాతినిధ్యం పెరుగుతుంది..



రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం విషయంలో చిత్తశుద్ధితో ఉంది. ఎమ్మెల్సీ కవిత ఆందోళనల వల్లే కేంద్రం మహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకువచ్చింది. ఈ బిల్లుతో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగనుంది.

– రమాదేవి, కౌన్సిలర్, బాన్సువాడ

తిమ్మారెడ్డిలో భయంభయం

- రాత్రయ్యిందంటే చాలు అర్థం కాని అరుపులు
- మర్నాగి కేకలన్న అనుమానాలు
- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు



తిమ్మారెడ్డి గ్రామం

సాక్షి, కామారెడ్డి: ఆ ఊళ్లో చీకటైందంటే చాలు.. అలజడి రేగుతోంది. ఎక్కడినుంచి వస్తున్నాయో తెలియని అరుపులు ఆ ఊరి వాళ్లకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. అరుపులు వినిపిస్తున్న వైపు వెళ్లి వెతుకుతున్నా.. ఏ ఆధారం దొరక్కపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో వారం రోజులుగా ఇదే పరిస్థితి.

ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో వారం రోజులుగా రాత్రయ్యిందంటే చాలు వింత అరుపులు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. మొదట్లో అరుపులు విన్న కొందరు భయంతో వణికిపోయారు. భయంతో రకరకాల ప్రయత్నాలు చేశారు. శాంతి కోసం పూజారులనూ ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయం ఊరంతా పాకడంతో అందరూ రాత్రి వేళలో మెలకువతో ఉండి వస్తున్న అరుపులను పరిశీలించారు. అరుపులు వినిపించినవైపు వెళ్లారు. ఒకవైపు వెళ్తే మరోవైపు నుంచి అరుపులు వినిపించడంతో కొంత ఆందోళనకు గురయ్యారు. నాలుగైదు రోజులు ఆ అరుపులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అరుపులకు కారణమేమిటి? అన్న కోణాలలో పరిశీలించారు. మర్నాగి అనే జంతువు అరుపులు కావచ్చని భావిస్తున్నారు. వ్యవసాయ గ్రామం కావడంతో పాటు ఊరికి ఒకవైపు అజామాబాద్ అడవి, మరోవైపు వెల్లుట్లపేట అడవి ఉన్నాయి. దాదాపు ఊరు చుట్టూరా అటవీ ప్రాంతం ఉంది. దీంతో ఈ గ్రామం చుట్టూ అడవి జంతువులు తిరుగుతుంటాయి. ఎన్నడూ ఇలాంటి అలజడి లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

అటవీ అధికారులు దృష్టి సారించాలి..

అరుపులు వినిపించిన తొలి రోజుల్లో ఆందోళనకు గురైన గ్రామస్తులు రాత్రివేళలో బయటకు వెళ్లాలంటే కొంత జంకారు. మెల్లమెల్లగా ఆ భయం నుంచి కోలుకుంటున్నారు. రాత్రి పూట పొలాల దగ్గరకి గుంపులుగా వెళ్తున్నారు. వెంట గుత్ప కట్టెలను తీసుకు వెళ్తున్నారు. అరుపులు వినిపించిన మొదట్లో ఎవరైనా గ్రామస్తులను ఇబ్బంది పెట్టే ఆలోచనతో అరుస్తున్నారేమో అనుకున్నారు. తర్వాత మూఢ నమ్మకాలవైపు మళ్లారు. అది కూడా కాదని తెలుసుకున్నారు. పంతుళ్లను కలిసి గ్రామానికి ఏదైనా దోషం ఉందేమోనని వాకబు చేశారు. అట్లా ఏమీ లేదనడంతో ఏదో జంతువు అయి ఉంటుందన్న అభిప్రాయానికి వచ్చారు. చివరకు మర్నాగి అరుపులు అయి ఉండవచ్చని భావిస్తున్నారు. సమస్యపై అటవీ శాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

'జీవన నైపుణ్యాలను నేర్పించండి'



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో ఉమారాణి

రాజంపేట: విద్యార్థులకు జీవన నైపుణ్యాలను నేర్పించాలని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి(జీసీడీవో) ఉమారాణి సూచించారు. మంగళవారం రాజంపేట కేజీబీవీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కౌమారదశలో వచ్చే శారీరక, మానసిక మార్పుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వారి లోపల ఉన్న భావోద్వేగాలను నియంత్రణలో ఉంచేడానికి టీచర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట అర్బన్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి, రిసోర్స్ పర్సన్స్ లక్ష్మి, పుష్పలత, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

జిల్లావైద్యాధికారిపై ఆరోపణలెన్నో..

- అంగట్లో సరుకుల్లా పోస్టుల అమ్మకాలు
- ఆస్పత్రులు, ల్యాబ్‌ల అనుమతుల్లోనూ అక్రమాలు
- ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు
- నేడు అదనపు కలెక్టర్ సమక్షంలో విచారణ



డీఎంహెచ్‌వో కార్యాలయం

కామారెడ్డి టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) లక్ష్మణ్‌సింగ్‌పై వచ్చిన ఆరోపణలపై బుధవారం విచారణ జరగనుంది. అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సమక్షంలో ఆయన చాంబర్‌లో ముఖాముఖి విచారణ చేపట్టనున్నారు.

అవినీతికి కేరాఫ్‌గా వైద్య శాఖ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మూడున్నరేళ్ల పాటు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన చంద్రశేఖర్‌పై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. తర్వాత ఆయన స్థానంలో వచ్చిన కల్పనా కాంటేపైనా ఆరోపణలు గుప్పుమన్నాయి. ఆమె ఆరునెలలపాటు పనిచేయగా.. అవినీతి ఆరోపణలతోపాటు సిబ్బంది, ఉద్యోగులనుంచి వ్యతిరేకంగా ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

ప్రస్తుత డీఎంహెచ్‌వోపై..

కల్పనా కాంటే స్థానంలో డీఎంహెచ్‌వోగా లక్ష్మణ్‌సింగ్ 2022 మార్చిలో బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ హయాంలో జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఎక్స్‌రే సెంటర్‌లకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు, అనుమతులు, రెన్యువల్‌కు సంబంధించిన ఫైల్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత డీఎంహెచ్‌వో విధుల్లో చేరగానే ఆస్పత్రులు, సెంటర్‌ల నుంచి రూ. 20 వేలనుంచి 40 వేల వరకు డబ్బులు వసూలు చేసి అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. కార్యాలయంలోని ఓ ఉద్యోగి ద్వారా ఈ తతంగం నడిపించారని తెలిసింది. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, ఆయుష్ ఆస్పత్రుల్లో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఎల్‌టీ, ఫార్మసిస్టులు తదితర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీలో భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. కంటి వెలుగు నిధులూ మింగేశారని ఆరోపణలు వచ్చాయి. జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురా, గొల్లవాడలో బస్తీ దవాఖానాకు సంబంధించి ఇంటి నెల అద్దె రూ. 5 వేలు ఉంటే రూ. 15 వేలు చెల్లించినట్లు మూడేళ్ల నిధులు కాజేశారని తెలిసింది. కంటి వెలుగులో పని చేసిన ఓ హెచ్‌ఈవో.. ఇప్పటికీ జిల్లా కార్యాలయంలోనే కొనసాగుతున్నారు. ఆ ఉద్యోగిని కొనసాగించడానికి డీఎంహెచ్‌వో డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న మరో ఉద్యోగి 200లకుపైగా న్యూట్రిషన్ కిట్‌లను మాయం చేశారని తెలిసింది. సర్వీస్ సర్టిఫికెట్‌ల కోసం ఏఎన్‌ఎంలనుంచి రూ. వెయ్యి చొప్పున వసూలు చేశారని ఆరోపణలున్నాయి. ఆయా అంశాలపై గతంలో 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలతోపాటు ఇతర సాక్ష్యాలతో ఇటీవల యూత్ కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన విచారణకు ఆదేశించారు. దీనిపై బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఉదయం 11 గంటలకు డీఎంహెచ్‌వో, కాంగ్రెస్ నేతల సమక్షంలో విచారణ జరగనుంది. ఒకవేళ విచారణలో అవినీతి తేలితే డీఎంహెచ్‌వోను సస్పెండ్ చేసే అవకాశాలున్నాయి.



కలెక్టరేట్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న కలెక్టర్ దంపతులు

కొలువైన గణపయ్య

జిల్లాలో సోమవారం వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసి గణనాథులను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆబాలగోపాలం ఈ వేడుకలలో పాల్గొంది. – కామారెడ్డి క్రైం

క్లుప్తంగా

భోగ్‌బండార్



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): హాజీపూర్ కట్టకింది తండాలో మంగళవారం భోగ్‌భండార్ కార్యక్రమం నిర్వహించారు. శ్రావణమాసం ఉపవాస దీక్షల ముగింపు కార్యక్రమంలో భాగంగా గిరిజన మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సేవాలాల్, భవానిమాత ఆలయం ఆవరణలో భోగ్‌భండార్ నిర్వహించారు. సర్పంచ్ చాందీబాయి, తండా పెద్దలు, గిరిజన మహిళలు తదితరులున్నారు.

ఆడపిల్లల పాలిట పెన్నిధి కేసీఆర్



ఎల్లారెడ్డి: ఆడపిల్లల పాలిట పెన్నిధి సీఎం కేసీఆర్ అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కొనియాడారు. మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆడపిల్ల పుట్టగానే రూ.13 వేలు, కేసీఆర్ కిట్‌తో పాటు, గురుకులాల్లో ఉచిత బోధన, వసతి సౌకర్యంతో పాటు, వివాహానికి రూ.లక్ష అందిస్తూ వారి పాలిట కుటుంబ పెద్ద పాత్ర పోషిస్తున్నారని అన్నారు. తనవంతు చిన్న కానుకగా ఆడపడుచులకు పట్టు చీరలను అందిస్తున్నానని అన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



పిట్లం(జుక్కల్): పిట్లంకు చెందిన వ్యాపారవేత్త పత్తి సంతోష్ నిరుపేదలను ఆదుకుంటూ అండగా నిలుస్తున్నారు. పెద్దకొడప్‌గల్ మండలం పోచారం గ్రామస్తులు పాల్కే ఖేతన్, పాల్కే కృపలు యూట్యూబ్‌లో క్లాసులు విని మెడిసిన్ సీటు సాధించారు. డబ్బుల్లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పత్తి సంతోష్ వారికి రూ.21 వేల నగదు సహాయాన్ని అందజేశారు. పత్తి సంతోష్ తన స్వగ్రామమైన కాస్లాబాద్‌లో ఎవరు చనిపోయినా అంత్యక్రియలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తారు. అనేక ఆలయాల అభివృద్ధికి విరాళాలు కూడా ఇస్తారు. అన్నదాన కార్యక్రమాలు, మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేస్తారు. ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ పత్తి సంతోష్ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

రైతు బీమా ప్రొసీడింగ్ కాపీ..

పిట్లం(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కంభపూర్ గ్రామానికి చెందిన గడ్డం సౌధార్య అనే మహిళా రైతు ఇటీవల మృతి చెందడంతో ఆమెకు నామినీ అయిన కుమారుడు గడ్డం సాయిరామ్‌కు రూ.5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని బీఆర్ఎస్ నేత విజయ్ అందజేశారు. వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పది తర్వాత మైకులు వాడొద్దు'

ఎల్లారెడ్డి: గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు రాత్రి 10 గంటల తరువాత మైక్ సౌండ్ సిస్టమ్‌ను ఆపి వేయాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. గణేశ్ మండపాల వద్ద శాంతియుతంగా పూజలను నిర్వహించాలని, రాత్రి సమయంలో కచ్చితంగా ఇద్దరు పడుకోవాలని, దీపాల చుట్టూ ఎలాంటి కాగితాలు లేకుండా చూడాలని సూచించారు. అలాగే లోపల, బయటా బాగా వెలుతురు ఉండేలా లైట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యుత్ కనెక్షన్‌లు కరెంటు తీగలకు కొక్కాలను తగిలించకుండా సమీపంలో ఉన్న వారి నుంచి విద్యుత్‌ను తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు.

ఓట్ల కోసమే కాంగ్రెస్ పాట్లు

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- కోనాపూర్‌లో గిరిజన బాలికల పాఠశాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అసెంబ్లీ స్పీకర్, మంత్రి

బాన్సువాడ రూరల్: ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు తుపాకీ రాముడిలా పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. మంగళవారం బాన్సువాడ మండలం కోనాపూర్ శివారులో గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన సముదాయం నిర్మాణానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇస్తున్న ఎన్నికల హామీలను ముందు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేసి మాట్లాడాలన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌పై తనకు నమ్మకముందని, ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని స్వయానా రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారన్నారు. కేసీఆర్ సారథ్యంలోనే గిరిజనులకు తగిన గుర్తింపు, న్యాయం జరిగిందన్నారు. కేసీఆర్ మూడోసారి కూడా సీఎం కావాలని తాను కాళ్లకు చెప్పులు వేసుకోకుండా దీక్ష చేస్తున్నానన్నారు.

జాతీయ పార్టీలకు దేశం మొత్తానికి ఒకే పాలసీ ఉండాలి కానీ కాంగ్రెస్ పార్టీ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో హామీ ఇస్తూ ప్రజల మోచేతికి బెల్లం పెడుతోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట నాడు ఇళ్లు కట్టకుండానే జేబులు నింపుకున్న ఘనత కాంగ్రెస్ నాయకులదన్నారు. గురుకుల బాలికల విద్యాలయం భవన సముదాయం కోసం తమ భూములను విరాళంగా ఇచ్చిన దళితులకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి దళితబంధు ప్రొసిడింగ్స్ అందించి సన్మానించారు. నస్రుల్లాబాద్ గిరిజన బాలుర గురుకుల విద్యాలయంలో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు మాత్రమే ఉన్నాయని, ఎంపీసీ, బైపీసీ గ్రూపులను కూడా మంజూరు చేయాలని కోరగా.. వెంటనే మంజూరు చేసిన మంత్రి సత్యవతి రాథోడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆర్డీవో భుజంగ్‌రావు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్, ఎంపీపీ నీరజావెంకట్రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మగోపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సంగ్రాంనాయక్, నాయకులు మోహన్‌నాయక్, వెంకటరమణారావు, సుభాష్, ఈడ్గి లక్ష్మి, భాస్కర్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, పిట్ల శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతి..

నస్రుల్లాబాద్: విద్యతోనే ఉన్నతి సాధ్యమని మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం దుర్కిలో గిరిజన గురుకుల బాలికల పాఠశాల తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ రాష్ట్రంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాలలు మహబూబాబాద్, బాన్సువాడ నియోజకవర్గాలలోనే ఉన్నాయన్నారు. బా న్సువాడకు మంజూరైన పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యేంతవరకు వేచి చూడకుండా ముందుగానే తరగతులు ప్రారంభించామన్నారు. అనంతరం నస్రుల్లాబాద్ పాఠశాలలో రూ.5 కోట్లతో అదనపు తరగతి గదులకు భూమి పూజ చేశారు. పురుషులకు దీటుగా సత్యవతి రాథోడ్ పనిచేస్తున్నారని స్పీకర్ ఆమెను ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎంపీపీ పాల్త్య విఠల్, జెడ్పీటీసీ జన్నుబాయి, నాయకులు శ్రీనివాస్, కిషోర్ యాదవ్, మాజిద్ ఖాన్, మల్లేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి

చిన్నారుల ప్రాణాలతో చెలగాటం

- చిన్నారి మృతికి కారణమైన ఆస్పత్రిని మూసివేయాలి
- డెంగీతో మృతి చెందిన బాలుడి తల్లిదండ్రుల ఆవేదన



అద్వంత్ (ఫైల్)



మాట్లాడుతున్న సౌందర్య-అన్వేశ్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): చిన్నారుల ప్రాణాలతో ఓ ప్రైవేటు ఆసుపత్రి చెలగాటం ఆడుతోందని బాధిత తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డెంగీతో మృతి చెందిన బాలుడి తల్లిదండ్రులు అన్వేశ్ సౌందర్యలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు అద్వంత్ ఈ నెల 17న డెంగీతో మృతి చెందినట్లు ఆరోపించారు. ఈ నెల 8న సదరు ఆసుపత్రికి జ్వరం ఉందని తమ కుమారుడిని తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మందులు రాసిచ్చి పంపించారు. మళ్లీ 15న జ్వరం ఉందని వెళ్తే అడ్మిట్‌చేసుకొని పరీక్షలు చేసి 16న డెంగీ ఉందని చెప్పి ఐసీయూలో చికిత్స అందించారు. చివరి క్షణంలో హైదరాబాద్ తీసుకెళ్లాలని సమాధానం ఇవ్వడంతో తీసుకెళ్లినట్లు తెలిపారు. 17న హైదరాబాద్‌లో చికిత్స అందిస్తుండగా బాబు మృతి చెందాడు. కామారెడ్డి ఆసుపత్రి నిర్లక్ష్యపు వైద్యులతోనే తమ కుమారుడు మృతి చెందాడని అధికారులు స్పందించి ఆసుపత్రిని మూసివేయాలని డిమాండ్ శారు. దీనిపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబీకులు తెలిపారు.

'ఆత్మహత్యల నివారణలో యువత ముందుండాలి'



కామారెడ్డి టౌన్: ఆత్మహత్యల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు యువత ముందుండాలని ప్రభుత్వ మానసిక వైద్యుడు జి. రమణ కోరారు. కామారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ, జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మంజీరా డిగ్రీ, పీజీ కళాశాలలో ఆత్మహత్యల నివారణ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. ఆత్మహత్యలకు ఎక్కువగా యువత ప్రేరేపితమవుతున్నారని, ప్రతి ఏటా ప్రపంచంలో 5 లక్షల మంది యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మానసిక ఒత్తిడికి లోనై ఏమీ తోచని క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. వంగ రాహుల్ కుమార్, గురువేందర్ రెడ్డి, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

– జమ్మూ కశ్మీర్ పీసీసీ అధ్యక్షుడు వికార్ రసూల్ వాని



తాడ్కోల్‌లో ప్రచారం చేస్తున్న వికార్ రసూల్

బాన్సువాడ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని జమ్మూ కశ్మీర్ పీసీసీ అధ్యక్షుడు వికార్ రసూల్ వాని కోరారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆయన సోమవారం బాన్సువాడలో పర్యటించారు. ఆయనకు నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్ రాజ్ ఘన స్వాగతం పలికారు. తాడ్కోల్‌లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన విజయభేరీలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలను ప్రజలకు వివరించామని అన్నారు. రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.15 వేలు, కౌలు రైతులకు ఏడాదికి రూ.12 వేలు, ప్రతి మహిళకు రూ.2500, గ్యాస్ సిలిండర్ రూ.500కే అందిస్తామని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తామని అన్నారు. నాయకులు కాసుల బాల్‌రాజ్, అలిబిన్‌అబ్దుల్లా, ఖలేక్, అసద్, తదితరులు ఉన్నారు.

వినాయక విగ్రహాలకు వినతులు



రాజంపేటలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



బాన్సువాడలో మాట్లాడుతున్న బాల్‌రాజ్

సాక్షి నెట్‌వర్క్ : వినాయక చవితి పురస్కరించుకుని జిల్లాలో పలు చోట్ల అంగన్‌వాడి టీచర్లు వినాయక విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అలాగే కొన్ని చోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్లు మాట్లాడుతూ..ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేల వేతనం ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె ఆపబోమని స్పష్టం చేశారు. బాన్సువాడలో అంగన్‌వాడి సిబ్బంది చేపట్టిన రాస్తారోకోకు బీజేపీ, కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

మంత్రి క్షమాపణ చెప్పాలి

బాన్సువాడ : అంగన్‌వాడీ టీచర్లకు మంత్రి సత్యవతి రాథోడ్ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడలో అంగన్‌వాడీ టీచర్లు రాస్తారోకో చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేసేందుకు బాన్సువాడకు వచ్చిన మంత్రి సత్యవతి రాథోడ్ వద్దకు వెళ్తే అంగన్‌వాడీ టీచర్లు మన వారు కాదని, మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అనడం శోచనీయమని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు మంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

దోమకొండ: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వచ్ఛ భారత్‌పై ర్యాలీ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత వల్ల అనారోగ్యాలు దరిచేరవన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీపీ కానుగంటి శారద, గ్రామ సర్పంచ్ నల్లపు అంజలి, ఎంపీడీవో చిన్నారెడ్డి, కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.



దోమకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు



చీనూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో రఘు

నాగిరెడ్డిపేట పరిధిలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛతకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. బహిరంగ మలవిసర్జన చేయవద్దని, పరిసరాలను పరిశుభరంగా ఉంచుకోవాలని వారు సూచించారు. చీనూర్‌లో ఎంపీడీవో రఘు, కార్యదర్శి సరేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఏడుగురి మృతి



సాయిలు (ఫైల్)

డొంకేశ్వర్, నందిపేట్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం అన్నారం శివారులోని కాలువలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ మంగళవారం తెలిపారు. నందిపేట్ మండలం ఇందిరానగర్‌కు చెందిన అలికె సాయిలు తన కుటుంబంతో కలిసి నూత్‌పల్లిలో వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఈ నెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాలేదు. కాలువలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి సాయిలు మృతదేహంగా గుర్తించారు. మృతుడి తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు.

పిట్లంలో ఒకరు..

పిట్లం(జుక్కల్): మండలంలోని పోతిరెడ్డిపల్లి రామ్ తండా స మీపంలో ఉన్న కల్వర్టులో అనుమానాస్పదస్థితి లో మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తె లిపారు. పిట్లంకు చెందిన బాలయ్య (60) ఈ నెల 17న మండలంలోని గౌరా రం గ్రామానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించగా కల్వ ర్టులో మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ల క్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బాలయ్య (ఫైల్)

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్..



మంగాదేవి (ఫైల్)

వర్ని: మండలంలోని అఫందిఫారం అంగన్‌వాడీ టీచర్ మంగాదేవి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వకీల్ ఫారంకు చెందిన మంగాదేవి అఫందిఫారంలో 20 సంవత్సరాలుగా అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. అనారోగ్యంతో ఆమె మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

చికిత్స పొందుతూ ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లికి చెందిన నక్క కాశీరాం(32) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. కాశీరాం మూడు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని జీవితంపై విరక్తితో ఈ నెల 10న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నాగమడుగు ఎత్తిపోతల పథకం పనుల వద్ద సోమవారం విద్యుదాఘాతంతో నికేశ్ ఆత్రం(22) మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన నికేశ్ ఆత్రం మండలంలోని ఒడ్డేపల్లి శివారులో నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ వద్ద కూలీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంజీరా నది వద్ద ఉన్న మట్టిని యంత్రంతో పరీక్ష చేస్తుండగా ఇనుప పైపుకు ఉన్న కరెంట్ వైరు తగలడంతో మృతి చెందాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గుమాస్తా కాలనీలో మరొకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుమస్తాకాలనీలో గంగోని సంతోష్ ఇంట్లో మేస్త్రీ పని చేస్తున్న చింతకాయల కుమార్(39) అకస్మాతుగా మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. యథావిధిగా పనికి వెళ్లిన కుమార్ మంగళవారం మధ్యాహ్నం పనిచేస్తుండగా కుప్పకూలిపోయాడు. దీంతో మృతుడి సోదరుడికి సమాచారం అందించడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు..



అనిల్(ఫైల్)

భిక్కనూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘట న మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎ స్సై సాయికుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెంది న చిన్నోళ్ల అనిల్ (25) దుస్తులను ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగి మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పలు చోట్ల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి

బాల్కొండ: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బుస్సాపూర్‌కు చెందిన నవీన్‌రెడ్డి తన స్కూటీలో 300 గ్రాముల ఎండు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో తీసుకొని బుస్సాపూర్ నుంచి మెండోరా వైపు వస్తుండగా పోలీసులను చూడగానే తప్పించుకునే ప్రయత్నం చేశాడు. గమనించిన వారు వెంబడించి పట్టుకున్నారు. తనిఖీలో పట్టుబడ్డ గంజాయిని నిందితుడు మహారాష్ట్రలోని కిన్వాట కొరటికల్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకొని తహసీల్దార్ సంతోష్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. గతంలో నిందితుడు గంజాయి కేసులో పట్టుబడ్డ నిందితుడని, నవీన్‌రెడ్డి గతంలో ఓ వృద్ధుడిని హత్య చేసి జైలుకు వెళ్లివచ్చాడని తెలిపారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై రాజశేఖర్

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తుల నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల శివారులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద కోరుట్లకు చెందిన మహ్మద్ సొహెబ్, మహ్మద్ ఇర్ఫాన్, ఐలాపూర్‌కు చెందిన సిరిగిరి సందీప్ అనుమానస్పదంగా కనిపించడంతో పోలీసులు విచారించి 300 గ్రాముల గంజాయితో పాటు బైక్, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇదే కేసులో ఐలాపూర్‌కు చెందిన బన్నీగౌడ్ పరారీలో ఉన్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

సంక్షిప్తం..

■ ఇసుక టిప్పర్ల అడ్డగింత

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను లారీ అసోసియేషన్ సభ్యులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఇసుక టిప్పర్ల నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

■ చిట్టి డబ్బుల కోసం వెళ్తే దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్, అతని భార్య చిట్టి డబ్బుల కోసం వెళ్తే నిర్వాహకుడు రాంగిరి నరేశ్, సతీశ్‌లు దాడి చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శ్రావణ్‌కుమార్ కాలనీలోని పక్కగల్లీలో ఉంటున్న రాంగిరి నరేశ్ వద్ద రూ.8.50 లక్షల చిట్టీలు వేశారు. చిట్టీలు పూర్తియినా డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో భార్య, భర్తలు చిట్టి డబ్బుల విషయమై నరేష్ ఇంటికి వెళ్లి అడుగగా నరేష్‌తో పాటు అతని తమ్ముడు రాంగిరి సతీశ్ దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

■ ప్రైవేట్ ఆసుపత్రిలో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెషెంట్ వద్ద నుంచి రూ.8 వేలు, సెల్‌ఫోన్‌ను దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఈ నెల 13న రూరల్ మండలంలోని మల్లారం పరిధిలోని చక్రదర్‌తండాకు చెందిన శ్రీనివాస్ కిడ్నీలో రాళ్ల సమస్య కారణంగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చాడు. 14న పేషెంట్ నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రూ. 8 వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

■ పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న మహ్మద్ అబ్దుల్ లతీఫ్, అమీర్ బీన్ మహ్మద్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. వీరు ఆహ్మదీ మార్కెట్, గోషాల్‌రోడ్డు ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

■ ఒకరిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని అశోక్‌నగర్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఎర్రం మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. బెల్ట్‌షాపులో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మద్నూర్‌లో బంగారం చోరీ

మద్నూర్(జుక్కల్): బంగారు నగలు పాలిష్‌చేస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి దుండుగుల 45 గ్రాముల బంగారాన్ని చోరీ చేసిన ఘటన మండల కేంద్రంలోని మార్వాడి గల్లీలో సోమవారం చోటు చేసుకుంది. పప్పు సేట్ ఇంటికి వెళ్లిన దుండగులు ఆయన లేకపోవడంతో భార్య పుష్ప జవార్‌తో మాటలు కలిపారు. తాము మహారాష్ట్ర నుంచి వచ్చామని తమ వద్ద బంగారాన్ని తక్కువ ధరకు పాలిష్‌చేసే పౌడర్‌ఉందని నమ్మబలికారు. నమ్మిన పుష్ప జవార్ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం, ఐదు గ్రాముల కమ్మలు కడిగి ఇవ్వాలని ఇచ్చింది. వారు కుక్కర్, పసుపు నీరు తీసుకురమ్మని చెప్పి అందులో బంగారం వేసినట్లు నమ్మించారు. కుక్కర్‌ను పొయ్యి మీద పెట్టాలని చెప్పి వెళ్లిపోయారు. కుక్కర్‌లో బంగారం లేకపోవడంతో మోసపోయినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన బాలిక (15)పై అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు.

అదే కాలనీకి చెందిన ఇద్దరు యువకులు ముజాహిద్, ముదాసీర్‌లు ఇంట్లోకి చొరబడి అసభ్యంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దోమకొండ: పురుగుల మందు తాగిన ముత్యంపేట గ్రామానికి చెందిన బండారి రాములు(42) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. మృతుడు రాములుకు ఆస్తి పంపకం విషయంలో అన్నదమ్ములు, తండ్రితో గొడవలు జరిగాయి. ఆస్తిని తనకు పంచరనే మనస్తాపంతో సోమవారం పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

అక్కడి నుంచి హైద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్: మండలం బోర్గాం(కె) చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు మంగళవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు.

రైల్వేస్టేషన్‌కు ఫేక్‌కాల్

- అప్రమత్తమైన రైల్వే అధికారులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌కు సోమవారం రాత్రి 8.30 వచ్చిన అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగుతున్నాయని 100కి ఫేక్ కాల్ వచ్చింది. దీంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో ఆగిన అజంతా రైలును పూర్తిగా రైల్వే, జీఆర్పీ పోలీసులు, ఫైర్ సిబ్బంది తనిఖీ చేశారు. ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు నిర్ధారించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫేక్ కాల్‌చేశారని, రైలుకు ఎలాంటి ప్రమాద జరగలేదని కామారెడ్డి రైల్వే స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్ తెలిపారు. ఈ ఫేక్ కాల్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.